క్లుప్తంగా

నేడు దేవరగోపవరం సచివాలయం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన దేవరగోపవరం సచివాలయ భవనం

నిడమర్రు: దేవరగోపవరంలో రూ.47 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం నూతన భవనాన్ని బుధవారం ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభిస్తున్నట్లు మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. అనంతరం రూ.20 లక్షల అంచనా వ్యయంతో గ్రామ రక్షిత మంచినీటి పథకం వద్ద ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌కు సంబంధించిన మైక్రోఫిల్టర్ల పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయిలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని సత్యకుమార్ కోరారు.

ట్రాక్టరు తిరగబడిన ప్రమాదంలో డ్రైవరు మృతి



ట్రాక్టరు ప్రమాదంలో గాయపడిన మన్నెల్లి నాగరాజుకు సపర్యలు చేస్తున్న పోలీసులు

ఉంగుటూరు: జాతీయ రహదారిపై చేబ్రోలు–కైకరం గ్రామాల మధ్య ట్రాక్టరు డివైడరును ఢీకొని తిరగబడిన ప్రమాదంలో మనెల్లి నాగరాజు (30)చనిపోయాడు. సోమవారం తణుకు మండలం దువ్వనుంచి ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడు గ్రామానికి ట్రాక్టరు లోడుతో వెళుతుండగా చేబ్రోలు దాటి కైకరం వస్తుండగా ఇంజన్ కుడివైపు చక్రం పేలిపోవడంతో వాహనం అదుపుతప్పి డివైడరును ఢీకొని తిరగబడింది. ఈ ప్రమాదంలో డ్రైవరు నాగరాజు అదే ట్రాక్టరు కిందపడి తీవ్రంగా గాయాలపాలయ్యాడు. హుటాహుటిన ఎస్సై మణికుమార్, పోలీసులు ఘటనా ప్రదేశానికి వచ్చి క్షతగాత్రుడికి సపర్యలుచేసి వెంటనే ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాగరాజు చనిపోవడంతో ఎస్సై మణికుమార్ కేసు నమోదుచేశారు. పోస్టు మార్టం తరువాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాగరాజు తండ్రి ఏసు, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

నేడు సీతారామచంద్ర స్వామి విగ్రహాల ప్రతిష్ఠ



సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పెదవేగి : కొండలరావుపాలెంలో బుధవారం ఉదయం 10.02 గంటలకు సీతారామచంద్ర స్వామి విగ్రహం, శిఖరం, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకులు కార్తీక శర్మ తెలిపారు. ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా 26, 27, 28వ తేదీల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి దివ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు. అనంతరం మహా అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ పర్యవేక్షిస్తోందని ఆయన తెలిపారు.

స్వామి వారికి పట్టు వస్త్రాల సమర్పణ

దెందులూరు: జోగన్నపాలెంలోని దేవాదాయ శాఖకు చెందిన బాలా త్రిపుర సుందరీ సమేత యోగలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి జోగన్నపాలెం కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ ఆలూరి గోవిందరావు పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఆలయంలో ఆలయ ధ్వజ, శిఖర, చండేశ్వర, కాలభైరవ, ద్వారపాలక, జంట నాగుల విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఉదయం 10.2 గంటలకు నిర్వహించనున్నట్టు ఈవో ఎం రామాంజనేయులు తెలిపారు.

చేబ్రోలులో చోరీ

ఉంగుటూరు: చేబ్రోలులో ఓ ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. చేబ్రోలు శివాలయం ప్రాంతంలో నివాసముంటున్న యలమర్తి కృష్ణారావు, సునీత దంపతులు ఇంటికి తాళం వేసి పంగిడి బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం వారు వచ్చి చూసే సరికి ఇంటి తలుపులకు వేసిన తాళం తీసి లోపలి బీరువాను తెరిచి ఉండటాన్ని గుర్తించారు. బీరువాలోని 22 తులాల వెండి, 2 కాసులు బంగారం, 15 వేల నగదు అపహరణకు గురైనట్టు కృష్ణారావు గుర్తించారు. దీనిపై చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల ఉంగుటూరు, చేబ్రోలు, నారాయణపురంలో మోటార్‌సైకిళ్లు అపహరిస్తున్నారని స్థానికులు తెలిపారు.

వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు ఉత్తమ సేవలు

- ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- వలంటీర్లకు సేవలకు ఘన సత్కారం, అవార్డుల ప్రదానం



పెదపాడు మండలంలోని వట్లూరు వలంటీరుకు సేవా వజ్ర అవార్డు అందిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీచైర్మన్ ఘంటా పద్మశ్రీ, కారుమూరి సునీల్‌కుమార్



వట్లూరులో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ కోటగిరి శ్రీధర్

పెదపాడు: ప్రజలకు ముంగిటకే అన్ని రకాల సేవలు అందించే వ్యవస్థ ఈ ప్రపంచంలో ఏ దేశంలోనూ లేదని, మన రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ వలంటీర్ల సేవలు పొందినవారేనని అలాంటి గొప్ప వ్యవస్థ వలంటీర్ల వ్యవస్థ అని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు మండలంలోని వట్లూరులోని క్రాంతి కల్యాణ మండపంలో దెందులూరు నియోజకవర్గంలోని వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని 1,326 మంది వలంటీర్లకు పతకాలు, ప్రసంశాపత్రం అందించి అనంతరం వారిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ సేవా వజ్ర పొందిన ఐదుగురు ఒక్కొరికీ రూ.45వేలు, సేవా రత్న పొందిన 17 మందికి ఒక్కొక్కరికి రూ.30వేలు, 1,304 మందికి సేవా మిత్రలకు ఒక్కొక్కరికీ రూ.15వేలు ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 2.95 లక్షల మంది వలంటీర్లకు సేవా అవార్డులు ప్రభుత్వం అందించినట్టు తెలిపారు. వలంటీర్ల వ్యవస్థ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తోందని వారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని వలంటీర్లకు సూచించారు. జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా ప్రసాద్, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ సూర్యోదయానికి ముందే వలంటీర్ల సేవలు ప్రజలకు అందుతున్నాయని, గత పాలనకు ఇప్పటి పాలనకు బేరీజు వేసుకోవాలని ప్రజలకు సూచించాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందని గుర్తు చేశారు. వలంటీర్లపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్ దుష్ప్రచారం చేస్తున్నారని దయ్యబట్టారు. వలంటీర్లు సేవలు ప్రజలకు మరింతగా అందించి వారి ప్రేమాభిమానాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెదపాడు, ఏలూరు మండల ఎంపీపీలు బత్తుల రత్నకుమారి, పెనుమత్స శ్రీనివాసరాజు, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం, దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని, బీసీ సెల్ అధ్యక్షుడు, ఏలూరు నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, పార్టీ జిల్లా కార్యదర్శి ఆళ్ల సతీష్‌చౌదరి, చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు ముదుగురు సూర్యనారాయణ, సీనియర్ నాయకులు పీవీరావు, బీసీ నాయకులు మోరు రామరాజు, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, ఇంద్రకీలాద్రి ట్రస్టుబోర్డు సభ్యులు తొత్తడి వేదకుమారి, పెదవేగి, ఏలూరు మండల కన్వీనర్‌లు మెట్లపల్లి సూరిబాబు, తేరా ఆనంద్, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, మండల కొండలరావు, వట్లూరు సర్పంచ్ గుజ్జుల రత్నకుమారి, కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్యాకేజీ రాజకీయాలకు బలి కావద్దు

భీమడోలు: జనసేన కార్యకర్తలారా ప్యాకేజీ రాజకీయాలకు బలి కావద్దని, పవన్ కల్యాణ్ రాజకీయ నాయకుడే కాదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ అన్నారు. భీమడోలులో మంగళవారం అన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు గందరగోళంగా ఉన్నాయని, ఉంగుటూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని అన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు ప్రజల ఆశీర్వాదం మెండుగా ఉందన్నారు. బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ విలువలను కాపాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ సుపరిపాలన అందిస్తున్నారన్నారు.

ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలి

పెదవేగి : వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా సహకరిస్తేనే ఓటు సద్వినియోగం అవుతుందని నూజివీడు డీఎస్పీ ఎం.లక్ష్మయ్య అన్నారు. నూజివీడు డీస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం పెదవేగి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆయన చెప్పారు. ప్రజలంతా సహకరించి, ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా బాధ్యత వహించాలని ఆయన సూచించారు. ఎక్కడైనా వివాదాలు వంటివి జరుగుతుంటే తక్షణం సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని, సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించవచ్చని డీఎస్పీ లక్ష్మయ్య సూచించారు. పెదవేగి ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ నుంచి వివరాలు తెలుసుకున్నారు.

'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం'



మేము సిద్ధం - మా బూత్ సిద్ధం వాల్‌పోస్టర్లన్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి

దెందులూరు: మేము సిద్ధం– మా బూత్ సిద్ధం కార్యక్రమానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులతో కలిసి మంగళవారం హాజరయ్యారు. ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మేము సిద్ధం– మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా దెందులూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాద్, దెందులూరు ఏఎంసీ చైర్మన్‌అప్పన ప్రసాద్, పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, నాయకులు బొద్దు సతీష్, కొట్టు విశాల్, అక్కినేని గోపి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మేము సిద్ధం – మా బూత్ సిద్ధం వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి నాయకులతో కలిసి ప్రదర్శించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



తాడేపల్లిలో మేము సిద్ధం సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే వాసుబాబు, నాయకులు

గణపవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తే వైనాట్ 175 నినాదం నిజమవుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసినట్లు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు తెలిపారు. తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పార్టీ నాయకులకు నిర్వహించిన సమావేశానికి హాజరైన ఉంగుటూరు నియోజకవర్గ నాయకులతో కలిసి వాసుబాబు హాజరయ్యారు. ఈసందర్భంగా వాసుబాబు విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ ఎంతో ఉల్లాసంగా జరిగిన ఈసమావేశంలో ముఖ్యమంత్రి పార్టీ శ్రేణులకు ఇచ్చిన సూచనలు ప్రతి కార్యకర్త పాటించాలన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ కన్వీనర్లు,జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సచివాలయ గృహసారథులు మేము సిద్ధం ప్లకార్డులు చేతపట్టి సీఎం జగన్‌ను కలిసినట్లు చెప్పారు. జగన్ తమను భుజం తట్టి ప్రోత్సహించారని పార్టీ నాయకులు తెలిపారు.

'మేము సిద్ధం' సభకు హాజరైన పార్టీ శ్రేణులు

నిడమర్రు: మంగళగిరిలో మంగళవారం సార్వత్రిక ఎన్నికల సమాయత్తంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించన మేము సిద్ధం– మా పోలింగ్ బూత్ సిద్ధం సభకు నిడమర్రు మండలం నుంచి ముఖ్య నేతలు హాజరయ్యారు. వీరిలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ కోడే కాశి, పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు ఉన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కోడే కాశి మాట్లాడుతూ వచ్చే 45 రోజులు కీలకమని ప్రతి కార్యకర్త వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని సీఎం జగన్ సూచించారని అన్నారు. ప్రజలంతా సంక్షేమ పాలనకు మద్దతు తెలిపేలా వైఎస్సార్ సీపీ శ్రేణులు కృషి చెయ్యాలని, ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని సీఎం జగన్ ఆదేశించారని అన్నారు. ఈ సమావేశం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపిందని మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ అన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి



పిప్పర పీహెచ్‌సీలో సిబ్బందిని వివరాలు అడుగుతున్న డీఎంహెచ్‌వో

గణపవరం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను పెంచాలని, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మహేశ్వరరావు పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు. మంగళవారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి రికార్డులను తనిఖీ చేశారు. వార్డుల్లో వసతులు పరిశీలించారు. ల్యాబ్, ఫార్మసీ నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో ప్రసవాలను ఇంకా పెంచాలని, ఓపీ సంఖ్య కూడా పెరగాలని సూచించారు. ఈనెల 3వ తేదీ ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియోను విజయవంతం చేయడానికి ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని సూచించారు. మండలంలో ఐదేళ్లలోపు పిల్లల వివరాలు, పోలియో కేంద్రాల వివరాలను ఆయనకు వైద్య సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కె.ప్రియాంక, ఆరోగ్య విస్తరణ అధికారి జి.వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ గొల్ల బాబూరావుని కలిసిన ఏసుబాబు



మంగళగిరిలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావును కలిసిన కట్టా ఏసుబాబు

దెందులూరు: దెందులూరు మండలం కొవ్వలికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక కావడం బడుగు, బలహీన వర్గాలకు గర్వకారణమని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు అన్నారు. మంగళవారం ఎంపీ గొల్ల బాబూరావును ఏసుబాబు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉండాలి

నిడమర్రు: ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే తన వద్ద చదుకునే ప్రతీ విద్యార్థికి తగిన న్యాయం చెయ్యగలరని ఎంఈవో కె. రాంబాబు అన్నారు. మంగళవారం క్రొవ్విడి ప్రాథమిక పాఠశాలలో విద్యా సంబంధిత అంశాలపై వార్షిక తనిఖీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంఈవో రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు ఉన్న ప్రతీ స్కూల్లో తప్పనిసరిగా ఇంటర్ నెట్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వం నాడు– నేడు పథకంలో పాఠశాలకు ఆధునిక సాంకేతిక పరికరాలు అందిస్తోందని వాటిని సద్వినియోగం చేసినప్పుడు ఆశించిన స్థాయిలో లక్ష్యాలకు చేరుకోగలరన్నారు. ఆయన వెంట సీనియర్ టీచర్ అప్పారావు, దాసు తదితరులున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం, మెను అమలుపై సమీక్షించి సూచనలు చేశారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన



రాచూరు హైస్కూల్లో సైన్సుడే అక్షర క్రమంలో ఒదిగిన విద్యార్థులు

ఉంగుటూరు: రాచూరు జిల్లా పరిషత్తు హైస్కూలు విద్యార్థులు జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సైన్సు డే అక్షరాలు మాదిరిగా విద్యార్థులు ఒదిగి కూర్చుని అందరినీ ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు విజయ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సైన్సు ఉపాధ్యాయులు వెలిచర్ల శ్రీనివాస్, దామోదరం పర్యవేక్షించారు.

గోపినాథపట్నంలో జగనన్న సురక్ష శిబిరం

ఉంగుటూరు: గోపినాథపట్నంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ డాక్టర్ వర్మ సేవలందించారు. సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి రోగులకు కార్డులు అందజేశారు. వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు



భీమడోలులో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు



భీమడోలులో మహిళల ఆరోగ్యంపై సూచనలందిస్తున్న గైనికాలజిస్ట్ సునీత

భీమడోలు: భీమడోలు సచివాలయం –1 వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శిబిరానికి రోగులు పోటెత్తారు. ఈ శిబిరాన్ని మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీత ప్రారంభించారు. భీమడోలు పంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు చేసారు. వారికి ఉచితంగా మందులను అందించారు. మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీత, ఎంపీడీవో టి.స్వర్ణలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. అనంతరం దీర్ఘకాలిక రోగులు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సుమారు 462 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. భీమడోలు సీహెచ్‌సీ సూపరిండెంటెంట్, గైనకాలజిస్ట్ సునీత, గుండుగొలను పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ కె.శ్రీలక్ష్మీ, ఆర్థోపెడిక్ సర్జన్ శివకుమార్ సేవలందించారు. వైఎస్సార్ కంటి వెలుగులో కంటి వైద్య నిపుణులు 40 మందికి కంటి పరీక్షలు చేసి పలువురికి కళ్లజోళ్లు అందించారు. గ్రామ కార్యదర్శి నందేటి ఠాగూర్, ఎంపీహెచ్‌ఈవో కిషోర్, సిబ్బంది మురళీ, శ్రీనివాస్, ఆశావర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఓటింగ్ యంత్రాల పనితీరుపై శిక్షణ

ఉంగుటూరు: ఓటింగ్ యంత్రాల పనితీరుపై ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం మంగళవారం ఉంగుటూరులో నిర్వహించారు. ఓటింగ్ యంత్రాలకు ఏ సమస్య వచ్చినా సెక్టారు అధికార్లు మరమ్మతులకు సిద్ధంగా ఉండాలని ఉంగుటూరు రిటర్నింగు అధికారి ఖాజావల్లీ అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని సెక్టోర్ అధికార్లు, మండల స్థాయి అధికార్లుకు ఆర్డీవో ఖాజావలీ యంత్రాల పనితీరుపై అవగాహన కల్పించారు. ఓటింగు సమయంలో తలెత్తే సమస్యలు– వాటిని ఎలా పరిష్కరించాలో వివరిస్తూ ప్రాక్టికల్‌గా చూపించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

తుది దశకు కైకలూరు రోడ్డు నిర్మాణం

- రూ.20.72 కోట్లతో పనులు, 90 శాతం పూర్తి
- 29న గురుకులపేట వద్ద వంతెన ప్రారంభం



మాదేపల్లి వద్ద నిర్మించిన కైకులూరు రోడ్డు



శ్రీపర్రు కాజ్‌వే వద్ద నిర్మించిన వంతెన

ఏలూరు రూరల్: ఏలూరు మండలం దెందులూరు నియోజకవర్గం పరిధిలోని కైకులూరు రోడ్డు అభివృద్ధి కల సాకారమౌతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.20.72 కోట్ల రూపాయలతో చేపట్టిన రోడ్డు పనులు 90 శాతం పూర్తయ్యాయి. 40 ఏళ్లకుపైగా మాదేపల్లి, గురుకులపేట, శ్రీపర్రు, మానూరు, మహేశ్వపురం, కలకుర్రుతో పాటు కైకులూరు ప్రజల ఎదురు చూసిన గురుకులపేట వద్ద కొత్త వంతెన సైతం పూర్తయింది. ఈ వంతెనను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఈ 29న ప్రారంభించనున్నారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామం నుంచి మహేశ్వరపురం శివారు వరకు సుమారు ఏడు కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణం రూ.20.72 కోట్ల వ్యయంతో చేపట్టారు. శ్రీపర్రు గ్రామం వద్ద సీసీ రోడ్డు నిర్మించారు. మహేశ్వరపురం శివారున బురద నేల వద్ద రోడ్డు కోతకు గురికాకుండా రివెంట్‌మెంట్ నిర్మించారు. రోడ్డుకు అటు ఇటుగా సాగునీరు పారుదలకు రోడ్డు కింద కల్వర్టులు ఏర్పాటు చేశారు. దాదాపు 90 శాతం పనులు పూర్తికాగా, మరో 3 కిలో మీటర్ల మేర రోడ్డు పూర్తికావాల్సి ఉంది.

గత ప్రభుత్వ హామీ బుట్టదాఖలు

గత ప్రభుత్వంలో కైకలూరు రోడ్డు గోతులమయంగా మారడంతో రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. గురుకులపేట తమ్మిలేరు వద్ద కాజ్‌వేపై వాహనాలు ప్రమాదానికి గురయ్యేవి. దీంతో పలువురు మృత్యువాత పడ్డారు. వరద సమయంలో కాజ్‌వే నీట మునిగి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయి. రోడ్డు అభివృద్ధి చేయాలని, కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చేశారు. నాటి టీడీపీ మంత్రి పీతల సుజాత, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఈ వంతెన, రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

సీఎం జగన్, ఎమ్మెల్యే కొఠారుకు కృతజ్ఞతలు



వంతెన, రోడ్డు నిర్మించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బ్యయ్యచౌదరికీ మా ఊరు ప్రజలు రుణపడి ఉన్నారు. గోతుల రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. గత ప్రభుత్వ హయాంలో తమ్మిలేరుకు వరద వస్తే మా ఊరు ప్రజలు నానా అగచాట్లు పడేవారు. కాజ్‌వే నుంచి మనిషి కూడా దాటలేని పరిస్థితి. టీడీపీ నేతలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఇప్పుడు ప్రయాణికులు కొత్త వంతెన నుంచి సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు.

– సైదు భాగ్యలక్ష్మి, శ్రీపర్రు సర్పంచ్

రూ.2 కోట్లతో మా ఊళ్లో అభివృద్ధి



కైకులూరు రోడ్డు మా ఊరు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నిత్యం ఈ రోడ్డు మీదుగా మేం ప్రయాణించాలి. ప్రభుత్వం మంచి పని చేసింది. గత ప్రభుత్వం మా ఊరు అభివృద్ధి కోసం పైసా కూడా ఖర్చు చేయలేదు. ఎమ్మెల్యే అబ్బ్యాచౌదరి కృషితో మా ఊరులో రూ.2కోట్ల అభివృద్ధి పనులు చేశారు. సచివాలయం, హెల్త్ క్లినిక్, సీసీ రోడ్లు, తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుచేశారు. గత పాలకులకు సమస్యలను పట్టించుకోలేదు. శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకున్నారు.

– బలే నాగరాజు, పెదయాగనమిల్లి, పెద్ద

పాఠశాలలో ల్యాబ్ టు స్కూల్ కార్యక్రమం



ల్యాబ్ టు స్కూలు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఉంగుటూరు: స్థానిక జిల్లా పరిషత్తు హైస్కూలు విద్యార్థులకు ల్యాబ్ టు స్కూలు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల ఆధ్వర్యం వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన హెచ్‌ఎం లీలా కుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్సు పట్ల ఆసక్తి, అభిరుచి కలగడానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల సైన్సు పట్ల విద్యార్థులకు ఆసక్తి పెరుగుతుందన్నారు. భౌతిక , రసాయన, జంతు, గణిత శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ బాబూరావు, బి.రాజ, డాక్టర్ కొండా రవి పాల్గొన్నారు.